# ఆరికేం మారాజులు

'పోనీలే పిల్లలుగల కుటుంబం. అట్ట కలిసొచ్చింది గనక పరువు దక్కింది.

పాపం, యింతకు ముంగల నాగరత్తమ్మ బిడ్డలు ఎన్ని అగసాట్లు బడిందీ ఎవురికి తెలవదు ? మరదేందో సొరాజ్జం సొరాజ్జం అనరుత్తా సబలు బెట్టేతలికి, అందిన పెతోణ్ణీ బట్టుకుని కొట్టో ఏసిబారేత్తిరి. కాత్తె వుండ మారాజుగందా సబల గుబులు యీ రంగయగోరికి దేనికి సెప్పరాదూ ? కొట్టో పణ్ణాకిటిరి. ఏనిగంటి మడిష్టి కాత్తా ఆవజాన నీలక్కబోయి బెయిటబడేతలికి బెమ్మాణ్ణమయి పాయె. చరే. గెణ్ణం గెడిసిందిగందా అనుకుంటా వుండేతలికే కద్దరు కిద్దరు కాంగిరేసు కద్దరంటూ యింటో పెతోర్నీ ముతగ్గుడ్డ కట్టమంటా వొచ్చి కూకుండె. ఏటనయినా నాగరత్తమ్మగోరు సావుబతుకులు తెల్చిందిగనకా ఎదుర్దిరిగి కాత్తె అదిదీ సరుదుకుంటా ఎల్లిపానిచ్చింది. మరి రంగయగోరికాక సూడవోతే యాడా నిలబడకనే పాయెగా ! రాటాలనీ మగ్గాలనీ– అదేందో వుత్తరాది కాంగిరేసనీ, యాడా ఆ కరుజుకు లెక్క తెలవందే. యిదేందని ఊల్లో పెతోరనుకుండారు. ఏణ్ణర్దం కొట్టో బడుంటే, పెల్లాం బిడ్డల దిక్కుమొక్కు సూసేవో దెవురో తెలవకా–కాత్తె నాగరత్తమ్మగోరి తమ్ముడు యాలకు ఆదుకుండాడు గాబట్టి చర్పోయింది– షడ్డీలు పెరగనే బెరిగి బంగారమంటి మాగాని కాత్తా సగానికి సగం తరుక్కుబాయె. క్లై! ఎట్టాటి మారాజులయినా సూత్తా సూత్తా వుంటేనే ఆవజాన దిగజారిపోల్చిందే గందా! ఏందోలే. ఏనాడో నాగరత్తమ్మబిడ్డలు ఆమార్తంపున్నెం జేసుకుండారు గనకా మల్లీ రోజులు కలిసొచ్చినయి. మరేంది! మా గూడెంలో మడ్పులుండారు దేనికీ ? ఎన్నేళ్ళు కొట్టుకుండా కడుపు కక్కుర్తితోనే చర్పోతా వుండె. యింతకి బెమ్మదేవుడి బిసగానీ యియ్యాల పాసిపన్జేసుకునే ఎంకాం గారెలు బూరెలు రామంటే వొత్తయ్యేట్టా? యింగా నయిం. నాగరత్తమ్మగోరి దరమమంటా యిన్నాలు కాత్తె రేపిటాల మాపిటాల కడుపన్నా ఆటటటట నిండుతా వుంది... ఆయన బొమ్యాడుగందా. ముందమోపిదాన్ని ఎటనోగట్ట నేనూ జారిపోతా. ఆ మురుపేందో ఆ సుకవేందో ఆ బతికినన్నాలూ అటటటట ఎల్లి పాయె...... బునలోకి ఏదుండా వుండకబోయినా పొద్దు వాలేతలికి పాను ఎటు బొయ్యేదో ఆయనకీ నాకూ తెలవాల్సిందే. అయిపాయె. రోజులే మారిపాయె. ఈ యుద్దాలేందో ఈ కరువులేందో బెమ్మాండంగా లెగుత్తుండయి. ఇంగానయిం.

నాగరత్తమ్మగోరి కడుపు సల్లగుండి అటటటట కడుపుకు యింత బెట్టి యీడే తల్దాసుకోనిత్తుండది. పానిలే పాపం రోజులు కలిసొచ్చినయి అంతేసాలు. ఎటనయినా రంగయగోరు బొ తెలివిగలోడు. అట్టుండాల బుద్ధిగల మద్సంటె. ఎరువుల యాపారం బెట్టాడూ కతే మారింది. అటనే సల్లగ వొడ్డపుర బెట్టాడూ మడిసే మారిపొయ్యాడు. ఎపుడుజూసినా నవ్వుతావుంటాడు. ఊఁ, సిరి దగులుకుందంటే మరట్టగాదూ? లేకుంటే ముంగలెప్పుడైనా అట్టాటి మా లావు యినుపెట్టె ఆ వజాన గోడలో బిగదీసుండేదెట్టా? నాగరత్తమ్మగోరుకూడ యీ మద్దె సవరాం అరవై రూపాల్లెక్కన సానా సవరాలు కొన్నది. మొదలు రంగయగోరు ఆడోరికి సెన్నాపట్నం కాణ్ణుంచిగాని సొమ్ములు సీరెలు తెప్పియడుగా. అట తెప్పిత్తాడు గనకనే అయి ఆ వజాన మెరుత్తా వుంటయి. యియాల ఎప్పటికైనా బంగారం యెంతుండా సెడదుగానీ యీ తెల్లోడి లోటుకాయితాలు యెపుడిక్కావాలయ్యా? సెదపురుగ్గాని నుప్పుగాని తగిలిందంటే బుడ్డెబుడ్డె కావల్సిందేగా?— రంగయగోరి మేడకి నుప్పుగాని సెదగాని యాడా తగల్దానికి యీలే లేదనుకో. మరి నల్లరాయి సిమిటీ నూరిగాదూ కట్టిచ్చింది. అదిగిందకనేగా మేడ సూడను పొరుగూర్జనం ఆ వజాన వచ్చిపోతా వుంటారూ. వరండాలో ముంగలా జోడుతెల్ల గుఱ్ఱాల కోసిబందిని సూత్తేనే జనం నోళ్ళు దెరుత్తారు. తోటకి మటుకు తోట్లో యెట్టాటి పూలమొక్కలుండయి? నాగరత్తమ్మగోరు ఇసుకులేకుండా పెతోరికి సీరెలు సొమ్ములుకాణ్ణుంచి పెతిదీ సీపిచ్చుద్ది. కాదు గూడ్దు ఎపుడన్నా పనోర్ని అటటట కేకలేసిందంటే ఆమాత్రం పెద్దమద్సితరా వుండక్కర్లేదెట్టా? అట్టంటది గనకనే పనోరు ఇప్పటికీ యెప్పటికైనా అడల్గుంటారు. లేకపోతే యీ కాలం మద్సులు నీ మాటినకేం. లచ్చాదికార్లు యాడన్నా వుండారంటే ఆమాత్రం బెట్టు సరి వుండదెట్టా? పోనిలే. రేపిటాల మాపిటాల ఇంత పెడతావుండార. అదే పదేలు. కాకపోతే కూడో కూడో అనరుత్తా కడుపులుగాలి మడుసులా వజాన నడీదుల్లో ఇరుసుకుబడి సత్తావుంటే యెవురయ్యా నీ కింతమాత్రం పట్టెడు కూడు గుడ్డ బెట్టేది? నిన్నునంటే నిన్నేగా రోజూ గేటుకాడికొచ్చి యేం దేందో అరిసి పోతావుండే పిచ్చోడు గేటుకాడే అవులించి పానాలిడిసిందీ! రంగయగోరు నాయింగలోడు గనకా పిచ్చోణ్ణి వొనుకుల్లో కట్టెలేయించి ఎంటనే కాలిపించాడు. యీయన ఇటనే బీదోరి కేవన్నా ఇట్టానే వుంటాడా. యీయాల మల్లీ ఇద్దరు యానోదోరు కాలవకాడ వొంద్రుబురద్దాగి పేగులుమాడి సచ్చారంట. సిత్రం! యీడ రంగయగోరింటో ఉండాగాబట్టి చర్పోయిందిగాని లేకుంటే నా ఒతుకూ అంతంత కావా

ల్చిందేగా?... యాటంలే రోజు లెవురునమ్మారు? అప్పుడే పరమట్న మడుసులు వూళ్లి డిసి యాడకో బోతుండారని కోసిబండి రాగవయ సెప్పాడు. ఎంతపంటలు సెద్దా పంటలొస్తేన నాలుగైదునెల్లకే ఇట్టుంటే ఇగ సమచ్చరం పొడుగుతా ఘెట సబ్బా! నిన్న కూడు మిగల్లేద. సుట్టాలొచ్చారని నాగరత్తమ్మగోరంటే, కోసిబండి రాగవయ్యా ఇవకాడికొచ్చి 'ఇగ మనకీ సాగుద్ది బరాటు' అంటా వుండాడు— యేందో? నన్నించి యెల్లిపామంటే?... యియ్యాలగాదు పద్దినాలో నెలో యెల్లినాకే కాదు వొద్దు యెల్లిపామంటే?... మారాజులు ఆరికేం బత్తాలు బత్తాలుండయి యెటుసేరి మా మీన వాలాల్చిందే దూడబాతులు...ఆఁ. అంతన్నాయం జరుగుద్దిగా ఇన్నాలూ ఆరి గడపకాడ పాసిపనీ ఆడిడా రొచ్చురోదా తీత్తా నమ్ముకొని పడుంటే? సీ పాడు, ఇదేంది నేను! ముంగలగా మనకి దేనికిలే నాయం పాయం తెలపందే అంటం. ఆనకి బగమంతుడే వుండాడు... కోసిబండి రాగవయను సూత్తుంటేనే బయంగా వుందదే! యెపుడు జూసినా యేందో గుండె బగిలే మాటలే తెత్తావుంటాడు. 'నిన్నా మొన్నా యెవురో ఆపీచర్లొచ్చి దాన్నెం లెక్కలు తిరుగుడుగా సూత్తావుండారు. యెటుచ్చుద్దో యెవారం?' అని మద్దా నమ్మించి అంటావుండాడేందీ?— అబ్బ యీ బర్రిపడ్డసావ అట్టురుసుద్దం— పానీలే నాకదేనికి... నిన్నటిసించి సూత్తావుండాగా ఆ గేడావు మడుసుల కల్లి అట సూసుద్దం... కోసిబండి రాగవయ్య అటనే సూత్తావుండాడు... పిచ్చోడు గేటుకాడ బిగదీసుకుబోతే ఎవికలు ఎల్లుకొచ్చినయి... యిటే తిరుగాడ్తా వుంటాడు యెగుర్తా— యెగుర్తా... ఆరికేం ఉండ మారాజులు...' సల్లగా అటనే నిదర బోయింది పాసిపని ఎంకాం, గొడ్డసాయిట్లో మూల.

('తెలుగుతల్లి' 1946 మార్చి)

*